సాక్షి
ప్రకాశం

సోమవారం । 23 । జూన్ । 2025



మరుగుదొడ్లు మింగేసి.. కాంప్లెక్స్ కట్టేసి

తర్లుపాడులో రూ.50 లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కాంప్లెక్స్ కడుతున్నారు. - 8లో..



మూఢనమ్మకాల నిర్మూలనే జేవీవీ లక్ష్యం

మూఢనమ్మకాల నిర్మూలనే జేవీవీ లక్ష్యమని జేవీవీ జాతీయ గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
38 /30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

గంజాయి మత్తు.. యువత చిత్తు

జిల్లాను గంజాయి పట్టిపీడిస్తోంది. తూర్పు, పశ్చిమం తేడాల్లేకుండా జిల్లాలోని అన్నీ ప్రాంతాల్లో యథేచ్ఛగా గంజాయి విక్రయిస్తున్నారు. విద్యార్థులు సైతం గంజాయి మత్తుకు బానిసలవుతున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా కేజీలకొద్దీ గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. గంజాయి మత్తులో ఘర్షణలు, నేరాలకు పాల్పడుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు మొక్కుబడి దాడులతో సరిపెడుతున్నారు.

- జిల్లాలో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు, వినియోగం
- మారుమూల గ్రామాలకు విస్తరించిన గంజాయి వ్యాపారం
- గంజాయి మత్తులో హత్యలకు పాల్పడుతున్న వైనం
- ఒంగోలు నగరంలో కేవలం రెండు రోజుల వ్యవధిలో 50 కిలోల గంజాయి పట్టివేత
- గంజాయి విక్రేతలుగా పట్టుబడుతున్న విద్యార్థులు
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు
- నామమాత్రపు దాడులతో సరి



సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

గతంలో కూలీలు, సాధువులు, బిచ్చగాళ్లు మాత్రమే గంజాయి వినియోగించేవారు. ఇప్పుడు విద్యార్థులు, యువకులు కూడా గంజాయి మత్తుకు అలవాటు పడిపోతున్నారు. పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన గంజాయి పల్లెలకు పాకింది. మేము అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే గంజాయిని కట్టడి చేశామని కూటమి పాలకులు గొప్పగా చెప్పుకుంటున్నారు. వాస్తవ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకుల అండదండలతో గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు గంజాయి వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటూ నామమాత్రపు దాడులతో సరిపుచ్చుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గంజాయి మత్తులో హత్యలు కూడా జరుగుతున్నాయి. తరచుగా ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. అయినా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

జిల్లా కేంద్రంలో యథేచ్ఛగా గంజాయి:

జిల్లా కేంద్రమైన ఒంగోలులో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. నగరం నలుమూలలా గంజాయి గుప్పుమంటోంది. పగలు రాత్రీ తేడా లేకుండా విద్యార్థులు, యువకులు గంజాయి మత్తులో జోగుతున్నారు. గంజాయి తాగి అర్ధరాత్రిళ్లు గొడవలు సృష్టించడం నిత్యకృత్యమైపోయింది. నగరంలోని గోపాల్ నగర్ ఎక్స్‌టెన్షన్, వెంకటేశ్వరకాలనీ, ముంగమూరు రోడ్డు చివర, కొత్త కూరగాయల మార్కెట్, గోపికృష్ణ థియేటర్ దగ్గర, బలరాం కాలనీ, అరవకాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంగముక్కలపాలెం రోడ్డు తదితర ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. సాయంత్రం 6 గంటలు దాటితే చాలు నగరంలోని మినీ స్టేడియం ప్రాంతంలో గంజాయి బ్యాచ్ చేరుతుంది. అటువైపుగా వెళ్లడానికి మహిళలు భయపడిపోతున్నారు. కొప్పోలు పరిసరాల్లో రాత్రయితే చాలు కొందరు హిజ్రాలు గంజాయి తాగి దారిలో వచ్చిపోయేవారిని వేధిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. రాత్రి 10 గంటలు దాటిన తరువాత నుంచి తెల్లవారుజాము వరకు ఈ ప్రాంతంలో గంజాయి ముఠాలు తిరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గోరంట్ల ప్రాంతంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. టీ స్టాల్స్‌లో కూర్చొని గంజాయి తాగి గొడవలకు దిగుతున్నారు. డాన్‌బాస్కో ఎదురుగా గోపాల్ నగర్ వెళ్లే చౌరస్తాలో రాత్రిళ్లు గంజాయి ముఠాలు చేరి గొడవలకు దిగుతున్నట్లు సమాచారం. ఆర్టీసీ డిపో పరిసరాల్లో కూడా జోరుగా గంజాయి వ్యాపారం సాగుతోంది. డిపో పరిసరాల్లో 60 అడుగుల రోడ్డు, సుందరయ్య రోడ్డులో ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. డిపోకు ఎక్కడెక్కడ నుంచో ప్రయాణికులు వచ్చిపోతుంటారు. దాంతో ఈ ప్రాంతాన్ని గంజాయి వ్యాపారులు అడ్డాగా చేసుకున్నట్లు సమాచారం. ఏబీఎం కాంపౌండ్లో గంజాయి బ్యాచ్ బెడద ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. గంజాయి, మద్యం తాగిన యువకులు మత్తులో ఘర్షణలకు దిగుతున్నారు. రెండు రోజుల క్రితం గంజాయి బ్యాచ్ ఏబీఎం కాంపౌండ్‌లో విద్యార్థుల మీదకు రాళ్లు విసరగా ఒక చిన్నారికి గాయాలైనట్లు తెలుస్తోంది. ఈ విషయంలో బాధితులు టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాత జిల్లా పరిషత్ కార్యాలయం కూడా గంజాయి అడ్డాగా మారిందని చెప్పుకుంటున్నారు. సత్యనారాయణపురం, కర్నూలు రోడ్డుల్లో గంజాయి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ గుజ్జుల యలమందారెడ్డి కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ఒక వృద్ధురాలిని పోలీసులు అరెస్టు చేశారు. టంగుటూరులోని రైల్వే స్టేషన్ వద్ద ఒక దుకాణంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం.



ఈనెల 14న ఒంగోలులో పట్టుబడిన 44 కేజీల గంజాయి (ఫైల్)

గంజాయి మత్తులో హత్యలు

ఇటీవల ఒంగోలు పరిసర ప్రాంతాల్లో రెండు హత్యలు జరిగాయి. ఈ హత్యలు గంజాయి మత్తులోనే చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నగరంలోకి కొప్పోలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద బాషా అనే వ్యక్తి హత్య జరిగింది. ఈ హత్య చిత్తు కాగితాలు ఏరుకునే ఇద్దరు యువకులు చేసినట్లు సమాచారం. గంజాయి, మద్యానికి అలవాటు పడిన ఇద్దరు యువకులు బాషా జేబులో ఉన్న పింఛన్ డబ్బుల కోసం హత్య చేసినట్లు సమాచారం. అలాగే దశరాజుకుంట సమీపంలో ఇటీవల ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన రాజా అనే యువకుడి హత్య జరిగింది. రాజాను కత్తితో పొడిచిన నిందితులు పెట్రోలు పోసి నిప్పంటించారు. సగం కాలిన తరువాత ఆ మంటల నుంచి పాక్కుంటూ కొంతదూరం వచ్చిన రాజా అలాగే కూర్చొని మృతి చెందాడు. నిందితులు మద్యంతోపాటుగా గంజాయి తాగి ఉన్నారని ప్రచారం జరిగింది. ఇలాంటి నేరాలకు గంజాయి కారణమవుతోంది. అయినా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు పెద్దగా స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన బీటెక్ విద్యార్థి

గంజాయి విక్రయిస్తూ ఒక బీటెక్ విద్యార్థి పోలీసులకు పట్టుబడడం సంచలనం సృష్టించింది. టంగుటూరు మండల పరిధిలోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదివే విద్యార్థి ఒకరు విశాఖపట్నం నుంచి 5 కిలోల గంజాయి తీసుకొచ్చాడు. వల్లూరులోని ఒక హోటల్ వెనుక ఉన్న హాస్టల్‌లో దాచి ఉంచాడు. ఈలోపు పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నారు. అంతేకాకుండా జిల్లాలోని అనేక ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు గంజాయికి అలవాటు పడిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ఏకంగా కాలేజీ హాస్టల్‌లోని గదులనే గంజాయి డెన్‌లుగా మార్చుకున్న ఘటనలు ఉన్నాయి. విద్యార్థుల మధ్య జరుగుతున్న ఘర్షణలకు ప్రధాన కారణం గంజాయి మత్తేనని ఒక పోలీసు అధికారి చెప్పడం గమనార్హం. జిల్లాలోని కళాశాలలు, కాలేజి హాస్టళ్లలోని విద్యార్థులకు గంజాయిపై అవగాహన కల్పించేందుకు పోలీసులు అట్టహాసంగా ప్రారంభించిన కార్యక్రమాలన్నీ ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది.

రెండు రోజుల వ్యవధిలో 50 కిలోల గంజాయి పట్టివేత

జిల్లా కేంద్రమైన ఒంగోలులో కేవలం రెండు రోజుల వ్యవధిలో 50 కిలోల గంజాయి పట్టుకోవడం పరిస్థితిని తెలియజేస్తుంది. అదికూడా నగరం నడిబొడ్డులోని అద్దంకి బస్టాండు సెంటర్లో ఒడిశా నుంచి తరలించిన 45 కిలోల గంజాయిని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అలాగే మరుసటి రోజు మరో 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం గిద్దలూరులో మరో 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకోవడం బట్టి చూస్తే జిల్లాలో ఏ స్థాయిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

పశ్చిమ ప్రకాశంలో గుప్పుమంటున్న గంజాయి

నిన్నా మొన్నటి వరకు జిల్లా కేంద్రానికి పరిమితమైన గంజాయి ఈ ఏడాది కాలంలో పశ్చిమ ప్రకాశానికి విస్తరించినట్లు సమాచారం. యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, మార్కాపురం, గిద్దలూరు, కంభం, కనిగిరి, పొదిలి ప్రాంతాలు గంజాయికి అడ్డాగా మారినట్లు ప్రచారం జరుగుతోంది. పశ్చిమంలోని మార్కాపురం, బేస్తవారిపేట, గిద్దలూరు, కంభం ప్రాంతాల్లో ఎక్కువగా బీఈడీ, ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని కొందరు గంజాయి వ్యాపారులు గుట్టుగా దందా సాగిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. శనివారం గిద్దలూరులో ఒడిశా నుంచి గంజాయిని తరలించి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది కంభంలోని హైవే పై ఉన్న ఒక లాడ్జిలో ముగ్గురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి గంజాయితోపాటుగా మత్తుమాత్రలను కూడా స్వాధీనం చేసుకున్నారు. యర్రగొండపాలెంలో కూడా పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. ఇటీవల పుల్లలచెరువులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి 1.6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బేస్తవారిపేట మండలం మోక్షగుండంలో ఒక సాధువు, మరో ఇద్దరు యువకుల నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధిపై దాడి

- ఫోన్ చేసి పిలిపించి రాయితో దాడిచేసిన టీడీపీ వర్గీయులు
- తలకు తీవ్ర గాయం, ఆస్పత్రికి తరలింపు

పొన్నలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. అధికారం ఉందనే అహంతో తెలుగు తమ్ముళ్లు సామాన్యులు, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై అకారణంగా దాడులకు తెగబడుతూ గ్రామాల్లో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధిపై టీడీపీ వర్గీయులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన పొన్నలూరు మండలం కే అగ్రహారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుని కథనం మేరకు... మండలంలోని బోగనంపాడు గ్రామానికి చెందిన ముళ్లమూరి గోపి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధిగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. ఇది చూసి ఓర్వలేని గ్రామంలోని కొందరు తెలుగు తమ్ముళ్లు అప్పుడప్పుడూ గోపిని దుర్భాషలాడుతూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. అయినా సరే వారితో గొడవ అనవసరమని గోపి ఎక్కడా సహనం కోల్పోకుండా గ్రామంలో తనపని తాను చేసుకుంటు ఉన్నాడు. అయితే గోపిపై ఎలాగైనా దాడిచేసి వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా భయపెట్టాలని పన్నాగం పన్నారు. ఈ క్రమంలో ఆదివారం బోగనంపాడు గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు మేకల మధు, మీసాల నాగేశ్వరరావు, ముత్తంగి మల్లికార్జున కే అగ్రహారంలోని మద్యం షాపు దుకాణం సమీపంలోకి వెళ్లి మేకల మధు ఫోన్ చేసి పని ఉంది నీతో మాట్లాడాలి రమ్మని గోపిని కే అగ్రహారం పిలిచాడు. ఈ లోపు కే అగ్రహారానికి చెందిన ఎస్‌కే బాషని పిలిపించి మాట్లాడారు. గోపి వచ్చిన తరువాత అతనిపై దాడి చేస్తే మద్యం ఇప్పిస్తామని రెచ్చగొట్టి బాషతో దాడి చేయడానికి సిద్ధం చేశారు. కొంత సమయం తరువాత గోపి రావడంతో నలుగురు కలిసి అతనితో మాటలు కలిపి గొడవకు దిగారు. ఇంతలో బాష ఒక్కసారిగా పక్కనే ఉన్న రాయి తీసుకొని గోపి తలపై కొట్టి దాడి చేశాడు. నలుగురు కలిసి గోపిపై దాడి చేస్తుండటంతో ఇంతలో చుట్టుపక్కల వారు దాడిని గమనించి అడ్డుపడగా మేకల మధు, మీసాల నాగేశ్వరరావు, ముత్తంగి మల్లికార్జున అక్కడ నుంచి తప్పించుకోవడంతో బాషను పట్టుకున్నారు. తీవ్రంగా గాయపడిన గోపిని చికిత్స కోసం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే పట్టుబడిన బాషను గ్రామస్తులు పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు.

జులాయిగా తిరుగుతుంటారు...

ఇదిఇలా ఉంటే గోపిపై దాడిచేసిన మేకల మధు, మీసాల నాగేశ్వరరావు, ముత్తంగి మల్లికార్జున, ఎస్‌కే బాష నిత్యం మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతుంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు వీరి ఆగడాలు మరింత ఎక్కువయ్యాయని అంటున్నారు. అలాగే బాష బైక్‌లు చోరీ చేస్తుంటాడని, అతనిపై శ్రీకాకుళంలో కేసు కూడా ఉన్నట్లు సమాచారం. గోపి వైఎస్సార్‌సీపీలో యాక్టివ్‌గా ఉండటం ఓర్చుకోలేని వీరు అతనిపై దాడి చేయించారని, అతన్ని చంపాలనే ఈ దాడికి తెగబడ్డారని గోపి బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు ఫిర్యాదు అందిందని, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై అనూక్ తెలిపారు.



దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న గోపి



పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌లో దాడి చేసిన బాష

ఉచిత బస్సు అమలు చేయకపోవడం అన్యాయం

ఒంగోలు టౌన్: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం అన్యాయమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి విమర్శించారు. స్థానిక ఎల్బీజీ భవనంలో ఆదివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షురాలు జి.ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. జిల్లాలో విచ్చలవిడిగా నడుస్తున్న మద్యం దుకాణాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనల్లో దోషులను పట్టుకోవడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజల మధ్య మత విద్వేషాలను సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశంలో సామరస్య వాతావరణాన్ని దెబ్బతీస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి విమర్శించారు. నరేంద్ర మోదీ పాలనలో గత 11 ఏళ్లలో మహిళా రక్షణ, సంక్షేమానికి సంబంధించిన అనేక చట్టాలను నిర్వీర్యం చేశారని చెప్పారు. ఆహార భద్రత, విద్యా వైద్య సౌకర్యాలు, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానలను నిరసిస్తూ కార్మిక సంఘాలతో కలిసి పోరాటాలు చేసేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తొలుత సీనియర్ నాయకురాలు ఏ.రాజ్యలక్ష్మి ఐద్వా పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.మాలతి, ఎస్కె నాగుర్, కే.రాజేశ్వరి, బి.రాజ్యలక్ష్మి, అంజనీ దేవి, పి.లక్ష్మి, జి.కళ్యాణి, విజయలక్ష్మి, రత్తమ్మ, ఇంద్రజ్యోతి, ప్రేమలత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా సమావేశంలో మాట్లాడుతున్న జీవీ కొండారెడ్డి

యువత పోరును జయప్రదం చేయాలి

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

ఒంగోలు టౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఇస్తానని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఇప్పటి వరకు నెరవేర్చకపోవడం దారుణమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్పటికీ నిరుద్యోగ భృతి విషయంలో ఎలాంటి ఆలోచన చేయడంలేదన్నారు. కూటమి పాలకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ యువత పోరు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సోమవారం నగరంలోని ప్రకాశం భవనం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తారని, జిల్లాలోని యువకులు, ముఖ్యంగా నగరంలోని విద్యార్థులు, యువకులు ఈ యువతపోరులో పాల్గొనాలని కోరారు.





సోయగాల చిలుకలు

నల్లమల అభయారణ్యంలో లేలేత పసుపు, నలుపు వర్ణంలో ఉన్న సీతాకోక చిలుకలు పర్యాటలకులను అబ్బురపరుస్తున్నాయి. గిద్దలూరు–నంద్యాల హైవే వెంట గుంపులు గుంపులుగా సంచరిస్తూ.. గాలిలో ప్రవాహంలా రివ్వున ఎగురుతున్న సీతాకోక చిలుకలు ప్రకృతి అందాలను తిలకించేవారిని కట్టిపడేస్తున్నాయి. ఎపియాస్ సంతతికి చెందిన ఈ సీతాకోక చిలుకలు తమిళనాడు, కేరళ రాష్ట్రాలతోపాటు మన నల్లమలలోనూ దర్శనమిస్తూ కనువిందు చేస్తున్నాయి.

– బేస్తవారిపేట

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి వద్ద మల్లవరం రిజర్వాయర్ ఎడమ కాలువ పక్కన గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభించింది. జాతీయ రహదారికి 200 మీటర్ల దూరంలో ఎడమ కాలువ గట్టున మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. 40 నుంచి 50 ఏళ్ల వయసు మధ్య ఉన్న వ్యక్తిదిగా గుర్తించారు. చనిపోయి వారం రోజులు అయి ఉండవచ్చని, ముఖమంతా చీమలు కుట్టడంతో ముఖం వాచిపోయిందని తెలిపారు. శవంపై ఎటువంటి దుస్తులు లేవని అన్నారు. ఎవరైనా ఇటీవల 40 నుంచి 50 సంవత్సరాల్లోపు వ్యక్తి తప్పిపోయి ఉంటే వారు మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు.

తప్పుడు కేసులతో వేధింపులకు గురి చేస్తున్నారు

- చిన్నగుడిపాడు సర్పంచ్ మల్లికార్జున

పెద్దదోర్నాల: కూటమి నాయకులు తనపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని మండల పరిధిలోని చిన్నగుడిపాడు సర్పంచ్ వల్లభనేని మల్లికార్జున ఆదివారం వాపోయారు. గ్రామంలో నీటి సమస్య తీర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. దానికి సంబంధించి కొన్ని ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో కూటమి నాయకులు తన వారిపైనే దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. అంతే కాకుండా కూటమి నాయకులు తనపై తప్పుడు కేసులు బనాయించారని ఆయన పేర్కొన్నారు. కేసులో భాగంగా వల్లభనేని మల్లికార్జునను ఆదివారం అరెస్ట్ చేసి మార్కాపురం కోర్టుకు తరలించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీకి పాకల విద్యార్థినులు



జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

సింగరాయకొండ: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన ఎంపికల్లో కే సిపోరా, కే త్రిగుణ ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 28వ తేదీ నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్ లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థినులను అభినందించారు.

ఒంగోలులో ఉపాధ్యాయుల నిరసన

ఒంగోలు టౌన్:

జిల్లా వ్యాప్తంగా ఉన్న 233 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను ఒంగోలు నగరంలోని డీఆర్ఆర్ఎం హైస్కూల్లో ఆదివారం చేపట్టారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ముగిసిన తరువాత ఖాళీగా ఉన్న కేటగిరీ4లోని మారుమూల గ్రామీణ పాఠశాలలను ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కేటాయిస్తుండడంతో అసంతృప్తికి గురయ్యారు. దాంతో వారు నిరసనలకు దిగారు. సుమారు నాలుగు గంటలపాటు నిరసన చేపట్టారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. పాఠశాలలోనే కాకుండా కాంప్లెక్స్ పరిధిలో కూడా తమకు పోస్టింగులు ఇవ్వాలని ఎంటీఎస్ ఉపాధ్యాయులు పట్టుబట్టారు. దీంతో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించాల్సిన బదిలీ ప్రక్రియ ఉపాధ్యాయుల నిరసనతో నిలిచిపోయింది. దీంతో సుమారు 4.30 గంటల పాటు బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. కాసేపటి తరువాత ఎంపీటీసీ ఉపాధ్యాయులు బుజ్జగించిన అధికారులు రాత్రి 7 గంటల తరువాత బదిలీల ప్రక్రియను మొదలు పెట్టారు. మొత్తం ఉపాధ్యాయులు బదిలీ ప్రక్రియ రాత్రి పూటనే జరగడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మరుగుదొడ్లు మింగేసి.. కాంప్లెక్స్ కట్టేసి!



పాత కమ్యూనిటీ బాత్రూములు (గూగల్ ఇమేజ్)

- తర్లుపాడులో ప్రభుత్వ స్థలం కబ్జా చేసిన విద్యుత్ శాఖ అధికారి
- ఆక్రమిత భూమి విలువ రూ.50 లక్షలకు పైమాటే..
- యథేచ్ఛగా అక్రమ నిర్మాణం చేపడుతున్నా స్పందించని అధికారులు
- రెవెన్యూ, పంచాయతీ అధికారుల తీరుపై విమర్శల వెల్లువ



తర్లుపాడులో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మిస్తున్న వ్యాపార కాంప్లెక్స్ భవనం

తర్లుపాడు: ప్రభుత్వ భూములకు కస్టోడియన్లుగా వ్యవహరించాల్సిన అధికారులు.. ఓ వైపు భూములు కబ్జా అవుతున్నా చేష్టలుడిగి చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణకు గురైన భూమిని డీఎల్‌పీఓ సైతం పరిశీలించినప్పటికీ చర్యలకు వెనుకాడుతున్న తీరు చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన తర్లుపాడులో వేణుగోపాల స్వామి దేవస్థానం సమీపంలోని గ్రామ కంఠం భూమిలో సుమారు 40 ఏళ్ల క్రితం పంచాయతీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించారు. కాలక్రమేనా అవి నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి చుట్టూ వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో భూమి ధర లక్షల రూపాయలు పలుకుతోంది. దీంతో ఆ స్థలం తమ బంధువులదే అంటూ మార్కాపురంలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఓ అధికారి రంగంలోకి దిగాడు. సుమారు రూ.50 లక్షలకు పైగా విలువ చేసే స్థలాన్ని దక్కించుకునేందుకు పావులు కదిపాడు. ఇటీవలే రాత్రికి రాత్రి కమ్యూనిటీ బాత్‌రూములు కూల్చివేసి వెంటనే నిర్మాణాలు ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అభ్యంతరం తెలపడంతో పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులను ఏమాత్రం పట్టించుకోని సదరు విద్యుత్ శాఖ అధికారి.. కూటమి పార్టీ నియోజకవర్గ ముఖ్యనేత పేరు చెప్పి స్థానిక అధికారుల నోర్లు మూయించాడు. దీనికి తోడు కొందరు అధికారులకు భారీ ఎత్తున లంచాలు ముట్టజెప్పారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని సాక్షాత్తూ మార్కాపురం డీఎల్‌పీఓ పరిశీలించి కూడా మిన్నకుండిపోయారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జనరల్ బాడీ సమావేశంలో..

గత నెలలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ పలువురు ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండల కేంద్రం కావడంతో బ్యాంకులు వెలుగు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో అనేక పనుల నిమిత్తం నిత్యం పదుల సంఖ్యలో మహిళలు తర్లుపాడుకు వస్తుంటారని, వారు వినియోగించుకునేందుకు కూడా టాయిలెట్లు లేవని సమావేశంలో అధికారులకు వివరించారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

అధికార పార్టీ నేతల సహకారం

విలువైన ప్రభుత్వ స్థలం విద్యుత్ శాఖ అధికారికి కట్టబెట్టేందుకు స్థానిక అధికార పార్టీ నేతలు కొందరు పూర్తి సహకారం అందించినట్లు గ్రామంలో జోరుగా చర్చ నడుస్తోంది. గ్రామంలో భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ స్థలం కూటమి ప్రభుత్వంలో పరులపాలు కావడంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖలో అత్యంత అవినీతిపరుడుగా పేరున్న ఆ అధికారికి గ్రామ స్థాయి అధికార పార్టీ నాయకులు సహకరించడంతో ఆ పార్టీలోని కొందరు టీడీపీ నేతలు గుర్రుగా ఉన్నారు. ఉన్నతాధికారులు, కలెక్టర్ జోక్యం చేసుకుని విలువైన ప్రభుత్వస్థలం అక్రమార్కుడి నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భవిష్యత్‌కు గ్యారెంటీ.. బాబు మార్కు గారడీ

- చంద్రబాబుకు జాబ్ ఇస్తే ఆయన యువతకు చేయిచ్చారు
- ఏడాదైనా ఉద్యోగాలు లేవు.. నిరుద్యోగ భృతి ఊసేలేదు
- నేటి యువత పోరును విజయవంతం చేద్దాం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపు



మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

మార్టూరు: 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ' అంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు అండ్ కో చేసిన గారడీని నమ్మి ఓటేసిన ప్రజలు, యువతను నిలువునా ముంచారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రిని నేటి 'యువత పోరు'లో నిలదీద్దామని పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం మార్టూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బత్తుల మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ/వార్డు సచివాలయాలు, ఆరోగ్య విభాగం, ఇతర ప్రభుత్వ శాఖల్లో కొత్తగా 2.50 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు ఉన్నవారిని సైతం ఊడబీకి పొట్టకొడుతున్నారని నిప్పులు చెరిగారు. ఏటా ఐదు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటి వరకు రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు అందిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి పేరుతో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు, అన్నదాతకు పెట్టుబడి నిధి కింద ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని నిలదీశారు. 50 ఏళ్లు నిండిన ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు నెలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ ఇస్తామన్న హామీని సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు మరిచిపోయి ఉండవచ్చు కానీ ఆయా వర్గాల ప్రజలు మరువలేదన్నారు.

తల్లికి వందనం లోపభూయిష్టం



సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన తల్లికి వందనం పథకాన్ని ఏడాది ఆలస్యంగా, అది కూడా లోపభూయిష్టంగా అమలు చేశారని బత్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హుల పేర్లు జాబితాలో ఎగరగొట్టి మోసం చేశారని మండిపడ్డారు. గత ఏడాది కాలంగా రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారని, పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇచ్చి ఉంటే రైతులకు కాస్తయినా ఉపశమనం కలిగి ఉండేదని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వంతో సంక్షేమ ఫలాలు అందిస్తామన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మౌనం పాటించడం వెనుక మర్మమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలకు కట్టుబడటమే కాక ఇవ్వని హామీలను సైతం నెరవేర్చారు కాబట్టే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గుర్తు చేసుకుని ప్రజలు నీరాజనం పడుతున్నారన్నారు. అనంతరం టీడీపీ బూత్ కమిటీ అధ్యక్షుల ద్వారా గత ఎన్నికల వేళ చంద్రబాబు ఇంటింటికీ పంపిణీ చేయించిన ష్యూరిటీ బాండ్లను ప్రదర్శించారు.

సత్తాచాటిన బల్లికురవ ఎడ్లు



పామూరు: మండలంలోని బొట్లగూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కమ్మవారిపాలెం, రఘునాథపురం సమీపంలోగల అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవ ఎడ్ల జత ప్రథమస్థానంలో నిలిచింది. పోటీల్లో మొత్తం 4 జతల ఎడ్లు పాల్గొన్నాయి. బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి ఎడ్లు నిర్దేశిత సమయంలో 2 వేల అడుగుల మేర బండ లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన తిండి నక్షత్రా రెడ్డి, ధ్రువసాయిరామరెడ్డి ఎడ్ల జత ద్వితీయస్థానం, బేస్తవారిపేట మండలానికి చెందిన లక్కు నాగశివశంకర్ ఎడ్లు తృతీయ స్థానం, నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసరవాయికి చెందిన సయ్యద్ కలాంబాషా ఎడ్ల జత నాలుగో స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.50 వేలను పి.మల్లికార్జున సంపూర్ణ, ద్వితీయ బహుమతి రూ..30 వేలను మల్లికార్జున, కృష్ణకుమారి, గురజాల వెంకటేశ్వర్లు, పత్తిపాటి రమణయ్య, తృతీయ రు.20 వేలను గుర్రం మాల్యాద్రి, గణపతి, సుజాత, నాలుగో బహుమతి రు.10 వేలను దేరంగుల శ్రీను, ప్రశాంతి సమకూర్చగా ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

ఇద్దరు టీచర్లకు జాతీయ విద్యారత్న అవార్డు

బిజ్జం రమాదేవి, చెరుకూరి జ్యోతిర్మయి

కురిచేడు: మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయినులను జాతీయ విద్యారత్న అవార్డు వరించింది. గొల్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బిజ్జం రమాదేవి, కురిచేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చెరుకూరి జ్యోతిర్మయికి ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా నిర్వహిస్తున్న నవాచారి గతి విధియాన్ గ్రూప్ అవార్డులు అందజేసింది. 2024–205 ఏడాదికిగాను ప్రకటించిన ఈ అవార్డులకు ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది ఎంపిక చేయగా అందులో కురిచేడు మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయినులకు చోటు దక్కడం విశేషం. విద్యార్థులకు వినూత్నమైన, సత్ఫలితాలు ఇచ్చే రీతిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులకు నవాచారి గతివిధియాన్ సంస్థ ఏటా అవార్డులు అందజేస్తోంది. అవార్డు సర్టిఫికెట్, మెమొంటో, పెన్‌ను స్పీడ్ పోస్టులో అందుకున్న ఇద్దరు టీచర్లను సహోద్యోగులు అభినందించారు.

మూఢనమ్మకాల నిర్మూలనే జేవీవీ లక్ష్యం

- జేవీవీ జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కే.నాగేశ్వరరావు



మహాసభలో మాట్లాడుతున్న జేవీవీ జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కే.నాగేశ్వరరావు

పామూరు: మూఢ నమ్మకాల నిర్మూలనే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని, యువత మూఢనమ్మకాలకు దూరంగా ఉండి శాస్త్రీయ దృక్పథం వైపు ఆలోచించాలని జేవీవీ జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు అన్నారు. జేవీవీ ప్రకాశం జిల్లా 18వ మహాసభలు ఆదివారం పామూరు మమూరి ఫంక్షన్ హాలులో షేక్.నాయబ్‌రసూల్ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభల సందర్భంగా జాతీయ జెండాను ఎస్సై టి.కిషోర్‌బాబు ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన జేవీవీ జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్నా మూఢనమ్మకాలు మాత్రం తగ్గడంలేదన్నారన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించాలని, పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, యూనివర్సిటీలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీచేయడంతోపాటు నిధులు మంజూరు చేయాలని తీర్మానాలు ప్రవేశపెట్టారు. మహాసభల్లో ప్రదర్శించిన మేజిక్ ఆహూతులను అలరించింది. జేవీవీ జాతీయ సలహాదారుడు మియా పాటలు ఆలోచింపజేశాయి. అనంతరం 15 మందితో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు షేక్.గయాజ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే.శ్రీనివాసులు, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లా మధు, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజూరుబాష, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవాధ్యక్షుడు జేసీహెచ్ వెంకటేశ్వర్లు, సుజాత, స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ నాయబ్‌రసూల్, మానవత సేవాసంస్థ అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరెడ్డి, జే.గోవిందయ్య, టి.వెంకటేశ్వర్లు, పోలేపల్లి సిద్దయ్య, కొమ్మరెడ్డి కొండమ్మ, ధనుంజయ, మీనా, మధు, ఫణి, డాక్టర్ కేటీసీ పాపారాయుడు, సభ్యులు పాల్గొన్నారు.



నేరేడుతో ఆరోగ్యం.. ఆదాయం!

- గతంలో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి పండ్లు దిగుమతి
- నేడు పశ్చిమ ప్రకాశంలో 250 ఎకరాల్లో నేరేడు పండిస్తున్న రైతులు
- రైతు వద్ద కిలో రూ.100, మార్కెట్‌లో ధర రూ.200–రూ.250

బేస్తవారిపేట: పశ్చిమ ప్రకాశంలో వర్షాభావ పరిస్థితులు ఉండటంతో పాటు ఖర్చు తక్కువ కావడంతో కొందరు రైతులు నేరేడు పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. చీడపీడలు ఆశించే అవకాశం తక్కువగా ఉండటంతో పురుగు మందుల పిచికారీ భారం తప్పుతోందని రైతులు చెబుతున్నారు. డయాబెటిక్(సుగర్) బాధితుల సంఖ్య ఎక్కువ అవుతుండటంతో మార్కెట్‌లో నేరేడు పండ్లకు మంచి డిమాండ్ ఉంది. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుతోపాటు మన రాష్ట్రంలోని రాయచోటి, అనంతపురం జిల్లాల నుంచి నేరుడు పండ్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అయితే పశ్చిమ ప్రాంతంలో కొందరు రైతులు నేరుడు పంటపై అవగాహన పెంపొందించుకుని దాదాపు 250 ఎకరాల్లో పంట సాగు మొదలు పెట్టారు. గిద్దలూరు నియోజకవర్గంలో 45 ఎకరాల్లో నేరేడు తోటలు సాగు చేశారు. రైతుల వద్ద నేరేడు పండ్లు కిలో రూ.100 పలుకుతుండగా, మార్కెట్‌లో మాత్రం రూ.200–రూ.250 ధరకు విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి దివ్యౌషధం

నేరేడు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. మధుమేహంతో పాటు అనేక శారీరక రుగ్మతలను నేరేడు పండు దూరం చేస్తుంది. ప్రతి 100 గ్రాముల నేరేడు పండ్లలో ప్రొటీన్స్ 0.07 శాతం, కొవ్వులు 0.3, ఖనిజాలు 0.04, పీచు 0.9 శాతం, అలాగే పిండి పదార్థాలు 15 మిల్లీగ్రాములు, ఫాస్ఫరస్ 15 మి.గ్రా, ఐరన్ 1.2 మి.గ్రా, విటమిన్ సీ 18 మి.గ్రా, పొటాషియం 55 మి.గ్రా ఉంటాయి. నేరేడులో ఉండే ఆమ్లగుణం వల్ల దీన్ని జామ్‌లు, వెనిగర్, సాండీస్, ఆల్కహాల్ తక్కువ శాతం ఉండే వైన్ తయారీలోనూ వినియోగిస్తారు.

5 ఎకరాలకు సబ్సిడీ

నేరేడు పంట సాగు చేయాలనుకునే రైతులకు హెక్టార్‌కు దాదాపు రూ.30 వేల చొప్పున రాయితీ వస్తుంది. ఒక్కో రైతు రెండు హెక్టార్ల వరకు సబ్సిడీ పొందవచ్చు. బహదోలి, బోడ, చింతామణి రకాలు అధిక దిగుబడులను ఇస్తాయి. రైతులు షోలాపూర్ నుంచి మొక్కలు తెచ్చుకుంటున్నారు. మార్కెట్‌లో నేరేడు పండ్లకు మంచి డిమాండ్ ఉంది. ఇప్పుడిప్పుడే రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

–డి.శ్వేత, ఉద్యానవన శాఖ అధికారి



నేరేడు పండ్ల తోట